సాక్షి ఖమ్మం

బుధవారం ¦ 5 ¦ మార్చి ¦ 2025



దగా చేస్తే ఉపేక్షించేది లేదు

మిర్చి రైతులకు మద్దతు చెల్లించకుండా దగా చేస్తే సహించేది లేదని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ హెచ్చరించారు.

8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధవారం సా॥) 6.22

సహర్ (గురువారం ఉ॥) 5.07

వాతావరణం

గరిష్టం / కనిష్టం 37° / 21°

జిల్లాలో ఉదయం, రాత్రి చలిగాలుల ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం మాత్రం గరిష్టస్థాయిలో ఉష్ణోగ్రత నమోదవుతుంది.

న్యూస్‌రీల్

‘వనజీవి’ని కలిసిన బీట్ ఆఫీసర్లు



రామయ్య దంపతులతో బీట్ ఆఫీసర్లు

ఖమ్మంరూరల్: మండలంలోని రెడ్డిపల్లికి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్యను రాష్ట్ర ఫారెస్ట్ అకాడమీ 35వ బ్యాచ్‌కు చెందిన 40మంది ఫారెస్ట్ ట్రైనింగ్ బీట్ ఆఫీసర్లు మంగళవారం కలిశారు. ఈసందర్భంగా విత్తనాల సేకరణ, మొక్కలు నాటడం, పరిరక్షణపై తన అనుభవాలను రామయ్య వివరించారు. మొక్కలు నాటడమే కాక అడవులను నరికివేయకుండా అడ్డుకోవడాన్ని అందరూ బాధ్యతగా భావించేలా అవగాహన కల్పించాలని సూచించారు. అటవీ అకాడమీ కోర్సు డైరెక్టర్ గంగారెడ్డి, కూసుమంచి రేంజ్ ఆఫీసర్ పి.శ్రీనివాసరావు, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కే.వీ.రామారావుతో పాటు ఉద్యోగులు కొండల్‌రావు, పి.డానియేల్, వెంకటేశ్వర్లు, నర్సింహారావు, మధు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



సమీక్షలో మాట్లాడుతున్న డీఐఈఓ రవిబాబు

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ వార్షికలు బుధవారం మొదలుకానుండగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలతో సమావేశమయ్యారు. బుధవారం నుంచి 25వ తేదీ వరకు నిర్ణీత తేదీల్లో ఉదయం 9నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. జిల్లాలో 72కేంద్రాలు ఏర్పాటుచేయగా, ప్రథమ సంవత్సరం విద్యార్థులు 17,783, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 18,877మంది పరీక్షలు రాయనున్నారని చెప్పారు. ఉదయం 8గంటల నుంచే విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించాలని సూచించారు. విద్యార్థులకు ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూమ్ నంబర్‌ను 99489 04023 నంబర్ ద్వారా సంప్రదించాలని తెలిపారు. అనంతరం డీఐఈఓ పలు పరీక్షా కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లపై ఆరా తీశారు.

సౌర విద్యుత్ ప్లాంట్లకు దరఖాస్తు గడువు పెంపు

ఖమ్మంవ్యవసాయం: రైతులు తమ భూముల్లో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకునే గడువును ఈనెల 10వ తేదీ వరకు పొడిగించారు. పీఎం కుసుమ్ పథకం కింద వ్యవసాయ యోగ్యం కాని బీడు, బంజర భూముల్లో ప్లాంట్ల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రైతులతో పాటు, వ్యవసాయ ఉత్పత్తి సంఘాలు, సహకార సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, వివిధ సంస్థలకు సైతం అవకాశం కల్పించారు. అయితే, దరఖాస్తు గడువు 2వ తేదీతో ముగియగా ఉమ్మడి జిల్లాలో 75 మంది ముందుకొచ్చారు. ఈనేపథ్యాన గడువు పెంచగా, ఆసక్తి ఉన్న రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని రెడ్‌కో ఉమ్మడి జిల్లా మేనేజర్ పి.అజయ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

సాగర్ జలాలను సద్వినియోగం చేసుకోండి



మాముసూరులో వరిని పరిశీలిస్తున్న డీఏఓ

చింతకాని/ఎర్రుపాలెం: సాగర్ జలాలను రైతులు సక్రమంగా వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య సూచించారు. చింతకాని రైతువేదికలో మంగళవారం రైతులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ వారబందీ విధానంలో నీరు విడుదల చేస్తుండగా చివరి ఆయకట్టుకు సైతం చేరేలా అధికారులు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఇదేసమయాన రైతులు కూడా సహకరించాలని కోరారు. అనంతరం డీఏఓ పుల్లయ్య ఎర్రుపాలెం మండలం మాముసూరులో వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఎక్కడైనా పంట వడలినట్లు అనిపిస్తే రెండు శాతం యూరియా ద్రావణాన్ని పిచికారీ చేయాలని తెలిపారు. మధిర ఏడీఏ విజయ్‌చంద్ర, ఏఓ మానస, ఇరిగేషన్ డీఈ సాంబశివరావు, ఏఈఓలు రాము, తేజ, ఆయేషా, కల్యాణి, జి.గోపి, బండి శ్రీకాంత్ పాల్గొన్నారు.



జిల్లాలో ఖనిజాల లీజ్‌ల వివరాలు

ఖనిజం	లీజ్‌ల సంఖ్య	భూమి విస్తీర్ణం (హెక్టార్లలో)
బ్లాక్ గ్రానైట్	141	293.474
స్టోన్, మెటల్	51	103.08
డోలమైట్	03	31.507
గ్రావెల్	03	6.830
బైరటీస్	02	7.972
క్వార్ట్జ్	01	5.837
కోరండమ్	01	2.00

ఉల్లంఘనులు

మైనింగ్‌లో నిర్వాహకుల ఇష్టారాజ్యం

- ఎక్కువ విస్తీర్ణంలో తవ్వుతూ తక్కువగా నమోదు
- ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్లలో గండి
- హైకోర్టులో పిల్ దాఖలుతో అధికారులకు నోటీసులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ‘జిల్లాలో మైనింగ్ అక్రమాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. లీజ్‌దారులు నిబంధనలను ఉల్లంఘించి ఇష్టారీతిన తవ్వకాలు జరుపుతున్నారు. లీజ్‌కు మించి ఎక్కువ తవ్వకాలు చేపడుతూ లెక్కల్లో తక్కువగా నమోదు చేస్తుండడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. జిల్లాలో 450.07 హెక్టార్ల ప్రభుత్వ, పట్టా భూముల్లో 202మంది వ్యక్తులు, సంస్థల మైనింగ్ కార్యకలాపాలు కొనసాగుతుండగా.. అనుమతులకు మించి అక్రమంగా, ఇష్టారీతిన తవ్వి తరలిస్తున్నారు’ అని ఇటీవల ఖమ్మంకు చెందిన ఎస్.రాము హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు వేశారు. దీన్ని విచారణకు స్వీకరించిన న్యాయస్థానం నాలుగు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. అయితే, జిల్లాలోని పలు చోట్ల అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నా మైనింగ్ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండడంతోనే ఈ పరిస్థితి నెలకొందని చెబుతున్నారు.

450.07 హెక్టార్లలో లీజు

జిల్లాలో 450.07 హెక్టార్ల ప్రభుత్వ, పట్టా భూముల్లో ఖనిజాల తవ్వకానికి 202 మంది వ్యక్తులు, సంస్థలకు అనుమతులు ఉన్నాయి. జిల్లాలోని 21 మండలాల పరిధిలో స్టోన్, మెటల్, గ్రావెల్, బ్లాక్ గ్రానైట్, కలర్ గ్రానైట్, బైరటీస్, డోలమైట్, క్వార్ట్జ్, కోరండమ్ తదితర ఖనిజాల మైనింగ్ జరుగుతోంది. ప్రధానంగా స్టోన్, మెటల్ 51 లీజ్‌లు, బ్లాక్ గ్రానైట్‌కు సంబంధించి 141 లీజ్‌లు ఉన్నాయి. అయితే, అనుమతి ఆధారంగా నిర్ణీత విస్తీర్ణంలోనే ఖనిజాలను వెలికితీయాల్సి ఉండగా పలువురు లీజ్‌దారులు నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారనే ఆరోపణలున్నాయి. నిర్ణీత స్థలానికి చుట్టుపక్కల సైతం తవ్వకాలు చేపట్టడం, ప్రభుత్వానికి మాత్రం తక్కువ లెక్కలు చూపిస్తుండగా ఖజానాకు చేరాల్సిన రూ.కోట్ల ఆదాయానికి గండి పడుతోందనే ప్రచారం జరుగుతోంది. ఇక పర్యావరణం విషయంలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని హైకోర్టులో దాఖలు చేసిన పిల్‌లో సదరు వ్యక్తి పేర్కొన్నాడు.

అధికారుల పర్యవేక్షణ ఏదీ?

మైనింగ్ కార్యకలాపాలను గనులు, భూగర్భశాఖ సహాయ సంచాలకులు, పర్యావరణ అనుమతులను కొత్తగూడెం కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయ అధికారులు పర్యవేక్షించాలి. అయితే వీరు విధుల్లో పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని పిల్‌లో ప్రస్తావించారు. కొందరు గనులు, భూగర్భ శాఖ అధికారులు.. తమ బంధువులు, మిత్రుల పేరుతో అనుమతులు తీసుకుని అక్రమ మైనింగ్‌లో భాగస్వాములుగా మారుతున్నట్లు పిల్‌లో పేర్కొన్నాడు. తద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందని, దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా తమ శాఖ ఉద్యోగులే కావడంతో బుట్టదాఖలు చేస్తున్నారని సదరు వ్యక్తి హైకోర్టుకు వివరించాడు.

సమాధానం ఇవ్వండి..

జిల్లాలో అక్రమ మైనింగ్ జరుగుతోందని ఖమ్మంకు చెందిన ఎస్.రాము గత ఏడాది అక్టోబర్‌లో హైకోర్టుకు లేఖ రాశారు. దీన్ని కోర్టు ప్రజాప్రయోజన వ్యాజ్యంగా స్వీకరించింది. అక్రమ మైనింగ్‌తోపాటు స్టోన్‌క్రషర్ల అక్రమ నిర్వహణ, పర్యావరణ విధ్వంసం కొనసాగుతోందని లేఖలో పేర్కొనగా సోమవారం కోర్టు విచారణ చేపట్టింది. ఈ వ్యవహారంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, గనులశాఖ ముఖ్య కార్యదర్శి, కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి, పీసీసీఎఫ్, కలెక్టర్, సీపీ, సంబంధిత శాఖ అధికారులు నాలుగు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని నోటీసులు జారీ చేసింది.

అన్నీ సక్రమంగానే ఉన్నాయి..

జిల్లాలో అన్ని క్వారీలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం. క్షేత్ర స్థాయిలో పరిశీలించాకే అనుమతులు ఇస్తున్నాం. అనుమతుల ఆధారంగా తవ్వకాలు కొనసాగుతున్నాయే తప్ప ఎక్కడా ఉల్లంఘనలు జరగలేదు. కోర్టు ఆదేశాలను గౌరవిస్తూ కౌంటర్ ఫైల్ దాఖలు చేస్తాం.

– సాయినాథ్, ఏడీ, మైనింగ్

మహిళా సమాఖ్యల ద్వారా ఆర్టీసీకి బస్సులు

మొదటి దశలోనే ఉమ్మడి జిల్లాకు స్థానం

ఖమ్మంమయూరిసెంటర్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేలా రాష్ట్రప్రభుత్వం వివిధ పథకాల్లో స్థానం కల్పిస్తోంది. ఇప్పటికే ఇందిరా మహిళ శక్తి పేరుతో క్యాంటీన్లు మంజూరు చేస్తుండగా, తాజాగా ఆర్టీసీ అద్దెకు తీసుకునే బస్సులను మహిళా సంఘాల నుంచే సమకూర్చుకోవాలని నిర్ణయించింది. రాష్ట్రంలో మొత్తం 600 బస్సులను ఈ విధానంలో సేకరించాలనేది లక్ష్యం కాగా, మొదటి దశలో 150 బస్సులను మహిళా సమాఖ్యలకు రుణాల మంజూరు ద్వారా కొనుగోలు చేయిస్తారు. ఈక్రమాన రుణాలు మంజూరు చేసే బ్యాంకులకు ప్రభుత్వమే పూచీకత్తు ఇస్తుంది. కాగా, మొదటి దశలో కొనుగోలు చేసే 150బస్సుల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మహిళా సమాఖ్యలకు సైతం స్థానం దక్కనుంది. సుమారు 30 – 35 బస్సులను ఇక్కడి మహిళా సమాఖ్యల ద్వారా కొనుగోలు చేసి ఆర్టీసీకి అప్పగిస్తారు. ఆపై ఆర్టీసీ ఒక్కో బస్సుకు రూ.77,220 చొప్పున అద్దె చెల్లిస్తుంది. ఇందులో కొంత మేర రుణవాయిదాలు చెల్లిస్తూ మిగతా నగదును సమాఖ్య సభ్యులుగా వాటాలు తీసుకుంటారు. కాగా, ఈనెల 8న మహిళా దినోత్సవం రోజునే 50బస్సులను ప్రభుత్వం ప్రారంభించనుండగా, జిల్లాలో మహిళా సమాఖ్యలను ఎంపిక చేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు.

వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి

అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ

వైరారూరల్: వడగాలులు వీస్తున్నందున ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. వైరా మండలం స్నానాల లక్ష్మీపురంలో మంగళవారం ఆమె ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యాన పనివేళల్లో మార్పులు చేయాలని అధికారులను ఆదేశించారు. పని ప్రదేశాల వద్ద ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలని తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రులు, పాఠశాలల్లో అందుతున్న సేవలపై ఆమె కూలీలకు అవగాహన కల్పించారు. ఏపీఓ అనురాధ, ఉద్యోగులు పాల్గొన్నారు.



నేలపై కూర్చుని కూలీలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

నైపుణ్య శిక్షణకు ప్రణాళిక

ఖమ్మం సహకారనగర్: నైపుణ్య శిక్షణ అమలుకు ప్రణాళిక రూపొందించాలని అదనపు కలెక్టర్ శ్రీజ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె స్కిల్ అక్విజిషన్ అండ్ నాలెడ్జ్ అవేర్‌నెస్ ఫర్ లైవ్లీహుడ్ ప్రమోషన్(సంకల్ప్) ద్వారా కళాశాలల్లో నైపుణ్య శిక్షణపై సమీక్షించారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సుల్లో యువతకు శిక్షణ ఇప్పిస్తే తక్షణ ఉపాధి లభిస్తుందన్నారు. జిల్లాలోని రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో ఎండాకాలం సెలవులు రాగానే నెల పాటు శిక్షణ ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే, కార్పొరేట్ షాపింగ్ మాల్స్‌లో అమ్మకానికి కూరగాయలు, పూల పెంపకాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. జిల్లా ఉపాధి అధికారి ఎన్.మాధవి, వివిధ శాఖల అధికారులు కె.సత్యనారాయణ, జ్యోతి, నవీన్‌బాబు, పురంధర్, వి.విజేత, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టు వరకు సాగర్ నీరు

అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

బోనకల్: బోనకల్ బ్రాంచ్ కెనాల్ పరిధిలో చివరి ఆయకట్టు భూములకు సైతం సాగర్ జలాలు అందేలా పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. బోనకల్ తహసీల్‌లో మంగళవారం ఆయన ఇరిగేషన్, వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. బీబీసీ పరిధిలోని చివరి భూములకు నీరందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారని తెలిపారు. వారబందీ విధానమే ఇందుకు కారణమని వారు చెబుతున్నందున, ఈ దఫా విడుదల చేసే సాగర్ జలాలను వృథా కాకుండా చివరి భూములకూ అందేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. అలాగే, ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు రాయితీని దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. తహసీల్దార్ పున్నంచందర్, ఎంపీడీఓ రమాదేవి, ఏఓ వినయ్‌కుమార్, ఇరిగేషన్ ఏఈ రాజేష్, ఆర్‌ఐ లక్ష్మణ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.



బోనకల్ : అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ఖమ్మం సహకారనగర్: ఈనెల 21న మొదలుకానున్న ఎస్సెస్సీ వార్షిక పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ పి.,శ్రీనివాసరెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన వరంగల్ ఆర్‌జేడీ సత్యనారాయణతో కలిసి చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లతో సమావేశమయ్యారు. పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు, ఇతర అంశాలపై సూచనలు చేశారు. డీఈఓ సోమశేఖరశర్మ, డీసీఈబీ కార్యదర్శి నారాయణ, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ రమేష్ పాల్గొన్నారు.

అందుబాటులోకి డీసీసీబీ క్యూఆర్ కోడ్ సేవలు

ఖమ్మంవ్యవసాయం: ఖాతాదారులు, వినియోగదారుల సౌకర్యార్థం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) క్యూఆర్(క్విక్ రెస్పాన్స్) కోడ్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ మేరకు సేవలను మంగళవారం ఖమ్మంలోని ప్రధాన కార్యాలయంలో చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు ప్రారంభించి మాట్లాడారు. బ్యాంకు ప్రణాళిక, అభివృద్ధి విభాగాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ విభాగం ద్వారా సదుపాయాల కల్పన, అవసరమైన సేవలను ప్రవేశపెడతామని.. ఇందులో భాగంగానే క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించేలా అమలుచేస్తున్న ఈ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాలకవర్గ సభ్యులు, సీఈఓ ఎస్.వెంకట ఆదిత్య, అధికారులు పాల్గొన్నారు.



క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్, అధికారులు

సీతారామ కాల్వల్లో ‘గోదావరి’ పరవళ్లు

- పంప్‌హౌస్‌ల ద్వారా ఎత్తిపోత
- నేడు రాజీవ్ కెనాల్‌కు నీరు విడుదల చేయనున్న మంత్రి తుమ్మల
- ఆపై ఎన్నెస్పీ కెనాల్‌లోకి గోదావరి జలాలు



అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు పంప్‌హౌస్ ద్వారా దిగువకు ఎత్తిపోస్తున్న జలాలు

అశ్వాపురం/ములకలపల్లి: సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కాలువల్లో గోదావరి జలాలు పరవళ్లు తొక్కుతూ ముందుకు సాగుతున్నాయి. రెండు పంప్‌హౌస్‌ల్లోనూ రెండో రోజు కూడా మోటార్లు ఆన్ చేయడంతో భారీగా దిగువకు తరలుతున్నాయి. అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులోని పంప్‌హౌస్ -1 నుంచి ములకలపల్లి మండలం వీకే రామవరం శివారులోని పంప్‌హౌస్-2కు చేరుకున్నాయి. దీంతో ఇక్కడ మంగళవారం డిశ్చార్జి పాయింట్ వద్ద నీటిని ఎత్తిపోశారు. దీంతో 35 మిలియన్ క్యూబిక్ ఫీట్ల(ఎంసీఎఫ్‌టీ) నీళ్లు కమలాపురం పంప్‌హౌస్-3కి వదిలినట్లు ఐబీ డీఈ మోతీలాల్ తెలిపారు. మంగళవారం ఒక్కరోజే ఐదున్నర గంటలపాటు మోటార్లు నడిపించి, 30 ఎంసీఎఫ్‌టీల నీటికి దిగువకు మళ్లించినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. కాగా, అశ్వాపురం మండలం కుమ్మరిగూడెంలోని దుమ్ముగూడెం ఆనకట్ట నుంచి బీజీ కొత్తూరులోని సీతారామ ప్రాజెక్ట్ ఫేస్-1 పంప్‌హౌస్ ద్వారా సోమవారం ఎనిమిది గంటలు, మంగళవారం ఎనిమిది గంటల పాటు గోదావరి జలాలు దిగువకు ఎత్తిపోశారు. గంటకు 5.4 ఎంసీఎఫ్‌టీ చొప్పున 86.4 ఎంసీఎఫ్‌టీ నీరు దిగువకు ఎత్తిపోశారు. బీజీకొత్తూరు, పూసుగూడెం, కమలాపురం పంప్‌హౌస్‌ల ద్వారా 100.22 కిలోమీటర్ల వద్ద ఏన్కూరు లింక్ కెనాల్ మీదుగా 8.60 కిలోమీటర్లు ప్రవహించనుండగా, నాగార్జున సాగర్ కెనాల్‌కు తరలించనున్నారు.

రైతుల్లో ఆనందం..

చంద్రుగొండ : రైతుల ఏళ్ల నాటి కల మంగళవారం సాకారమైంది. ట్రయల్‌రన్‌లో భాగంగా సీతారామ కాల్వలోకి నీరు వదలగా అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాలకు గోదావరి జలాలు రావడంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

నేడు రాజీవ్ లింక్ కెనాల్ ట్రయల్ రన్..



ఏన్కూరు సమీపాన రాజీవ్ లింక్ కెనాల్ గేట్

జూలూరుపాడు: సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నుంచి ఎన్నెస్పీ కెనాల్‌లోకి గోదావరి జలాలు చేరనున్నాయి. ఈ మేరకు సీతారామ మెయిన్ కెనాల్ నుంచి ఏన్కూరు ఎన్నెస్పీ కెనాల్‌లోకి గోదావరి జలాలను చేర్చే రాజీవ్ లింక్ కెనాల్ వద్ద బుధవారం ట్రయల్‌రన్ జరగనుంది. అశ్వాపురం మండలంలోని పంప్‌హౌస్ నుంచి వంద కి.మీ. దూరాన వినోభానగర్ మెయిన్ కెనాల్ ద్వారా ఏన్కూరు ఎన్నెస్పీ కెనాల్‌లోకి నీటి తరలింపునకు ఈ కాల్వ నిర్మించారు. ఈమేరకు బుధవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే రాందాస్ కెనాల్ వద్ద గోదావరి జలాలు విడుదల చేసి పూజలు నిర్వహిస్తారు.

ఇక సాఫీగా పరిష్కారం

- అమల్లోకి ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు రాయితీ
- ఫీజు చెల్లించాలని దరఖాస్తుదారులకు మెసేజ్
- జిల్లాలో 99,745 దరఖాస్తులు

ఖమ్మంమయూరిసెంటర్: ఎల్‌ఆర్‌ఎస్(లే ఔట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) దరఖాస్తుల పరిష్కారం ఇకపై సాఫీగా, వేగంగా జరగనుంది. ప్రభుత్వం గత నెల 19న ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులో 25 శాతం రాయితీ ప్రకటించినా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో జిల్లాలో అమలు కాలేదు. ప్రస్తుతం ఎన్నికల ఫలితం వెలువడడంతో జిల్లాలోనూ రాయితీ అమలుకు గ్రీన్ సిగ్నల్ లభించింది. దీంతో సోమవారం రాత్రి నుంచే ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారు 25శాతం రాయితీతో ఫీజు చెల్లించాలని మెస్సేజ్‌లు వస్తున్నాయి. వెబ్‌సైట్‌లో దరఖాస్తు నంబర్ ఆధారంగా పరిశీలిస్తే ఎంత ఫీజు చెల్లించాలో చూపిస్తుండడంతో మంగళవారం ఉదయమే పలువురు కేఎంసీతో పాటు ఇతర మున్సిపల్ కార్యాలయాలకు చేరుకుని ఆరా తీయడం కనిపించింది.

భారీగా దరఖాస్తులు

ఎల్‌ఆర్‌ఎస్ కోసం ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు మధిర, సత్తుపల్లి, వైరా మున్సిపాలిటీల్లో 51,425 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 8,851 అనుమతి పొందగా.. 339 దరఖాస్తులను తిరస్కరించారు. గతంలోనే రిజిస్ట్రేషన్ చేయించుకున్నవి 53 ఉండగా, సరైన డాక్యుమెంట్లు లేక 2,035 దరఖాస్తులు పెండింగ్ పెట్టారు. అలాగే, నిషేధిత సర్వేనంబర్ల జాబితాలో 5,946 ప్లాట్లకు సంబంధించి దరఖాస్తులు అందాయని గుర్తించారు. కాగా, దరఖాస్తుల పరిశీలన మూడు దశల్లో చేపడుతుండగా ఎల్-1 దశలో 33,302, ఎల్-2లో 259, ఎల్-3 దశకు 51 చేరాయి. మొత్తంగా ఫీజు చెల్లించడం కోసం 8,916 దరఖాస్తులకు అనుమతి ఇవ్వగా 1,151 దరఖాస్తులకే యజమానులు ఫీజు చెల్లించారు. ఇంకా 7,765 దరఖాస్తులకు ఫీజు పెండింగ్ ఉంది.



కేఎంసీలోని హెల్ప్ డెస్క్ వద్ద దరఖాస్తుదారుల అనుమానాలను నివృత్తి చేస్తున్న ఉద్యోగులు

వాటిని పక్కకు పెట్టి..

ఎల్‌ఆర్‌ఎస్ కోసం కేఎంసీ తర్వాత అత్యధిక దరఖాస్తులు ‘సుడా’ పరిధిలో అందాయి. అయితే, ఎల్-1 దశలో పరిశీలన అధికారులకు భారంగా మారగా, ప్రభుత్వం ఫీజు రాయితీ ఈనెల 31వ తేదీ వరకే వర్తిస్తుందని చెప్పడంతో ఆలోగా దరఖాస్తుల పరిశీలన పూర్తి కాదని తెలుస్తోంది. దీంతో నిషేధిత, ప్రభుత్వ, ఇరిగేషన్ స్థలాల్లో ఉన్న లేఔట్లు, స్థలాలను పక్కన పెట్టి అన్నీ సక్రమంగా ఉన్న ప్రైవేటు స్థలాలకు 25 శాతం రాయితీతో ఫీజు చెల్లించేలా అవకాశం కల్పించనున్నారు. కాగా, ఫీజు చెల్లించిన దరఖాస్తుల్లోనూ ఏమైనా సమస్యలు గుర్తిస్తే వాటిని తిరస్కరించే అవకాశముందని అధికారులు ముందుగానే చెబుతున్నారు. ఒకవేళ అలా జరిగితే ప్రాసెస్ ఫీజు మినహా మిగిలిన మొత్తం చెల్లిస్తామని వివరిస్తున్నారు.

దరఖాస్తుదారులకే సమాచారం..



ఎల్‌ఆర్‌ఎస్‌కు ప్రభుత్వం ప్రకటించిన రాయితీ అమల్లోకి వచ్చింది. ఈ విషయంలో దరఖాస్తుదారులకు నేరుగా మెసేజ్ వెళ్తోంది. అలా అందిన వారు ఫీజు చెల్లిస్తే దరఖాస్తులు పరిశీలించి రెండు, మూడు రోజుల్లో రెగ్యులరైజ్ ప్రొసీడింగ్స్ జారీ చేస్తాం. – అభిషేక్ అగస్త్య, కమిషనర్, కేఎంసీ

ఎల్‌ఆర్‌ఎస్ కోసం అందిన దరఖాస్తులు

మున్సిపాలిటీ	దరఖాస్తులు	ఫీజు చెల్లింపునకు అనుమతి పొందినవి	ఫీజు చెల్లించినవి
ఖమ్మం కార్పొరేషన్	39,945	3,735	939
మధిర	4,276	1,488	97
సత్తుపల్లి	3,688	2,391	62
వైరా	3,516	1,237	48
సుడా	34,393	07	04
గ్రామపంచాయతీలు	13,927	58	01
మొత్తం	99,745	8,916	1,151

మరింత ‘అ’ధనం’..

ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఫీజు చెల్లించాలని ప్రభుత్వం మెసేజ్ పంపిస్తోంది. ఫీజు చెల్లించాక వివరాలను అధికారులకు అందజేస్తే స్థలాలను పరిశీలించి ప్రొసీడింగ్స్ ఇవ్వనున్నారు. దీంతో దరఖాస్తుదారులు మంగళవారం కేఎంసీ, సుడా, ఇతర మున్సిపాలిటీలకు క్యూ కట్టారు. అసలు ఫీజు, రాయితీ పోగా ఎంత కట్టాలని ఆరా తీస్తుండగా.. కొందరు రాయితీ తీసేస్తే ఇంకా ఫీజు పెరుగుతోందని మొర పెట్టుకోవడం కనిపించింది. ఆన్‌లైన్‌లో లేకున్నా అదనంగా రూ.10 వేలు చెల్లించాల్సి వస్తున్న అంశాన్ని ఉన్నతాధికారులు స్థానిక అధికారులు నివేదించినట్లు తెలిసింది. ప్రభుత్వం ఖాళీ స్థల ట్యాక్స్‌ను కూడా ఫీజులో పొందుపర్చడంతో ఇలా జరిగిందని సమాచారం.

క్లుప్తంగా

అధ్యాపకురాలికి డాక్టరేట్


కె.విజయలక్ష్మి

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల ఇంగ్లిష్ అధ్యాపకురాలు కె.విజయలక్ష్మికి డాక్టరేట్ లభించింది. కైకలూరులోని వైవీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ కె.పంకజ్ కుమార్ పర్యవేక్షణలో ఆమె 'ఎక్స్ పేట్రియట్ ఎక్స్‌పీరియన్స్ ఇన్ ఝుంపాల హరీస్ ఫిక్షన్ – ఏ క్రిటికల్ స్టడీ' అంశంపై పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథం సమర్పించగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ ప్రకటించారు. ఈసందర్భంగా విజయలక్ష్మిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ జాకీరుల్లా, వైస్ ప్రిన్సిపాళ్లు ఏ.ఎల్.ఎన్.శాస్త్రి, డాక్టర్ బానోత్‌రెడ్డి, అధ్యాపకులు ఏ.నర్సమ్మ, రాంబాబు, బంగారి, కె.రవికుమార్ తదిరులు అభినందించారు.

రేపు జాబ్ మేళా

ఖమ్మం రాపర్తినగర్: ఖమ్మం టేకులపల్లిలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో ఈనెల 6న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిలా ఉపాధి కల్పన శాఖాధికారి ఎస్.మాధవి తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన వైఎస్‌కే ఇన్ఫోటెక్, జీజే సొల్యూషన్స్ కంపెనీల్లో ఉద్యోగ నియామకాలకు ఆయా సంస్థల బాధ్యులు ఇంటర్వ్యూ లు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈమేరకు 18–30 ఏళ్ల వయస్సు కలిగి ఎస్సెస్సీ మొదలు డిగ్రీ అర్హత ఉన్న వారు హాజరుకావొచ్చని తెలిపారు.

పీఎం ఇంటర్న్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంవన్‌టౌన్: ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం ద్వారా శిక్షణ కోసం ఆసక్తి, అర్హతలు ఉన్న వారు ఈనెల 11వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పరిశ్రమల అధికారి టి.సీతారాం సూచించారు. ఇంటర్న్‌షిప్‌నకు ఎంపికైన అభ్యర్థులకు 12నెలల వ్యవధిలో కనీసం ఆరు నెలలు ఉద్యోగ శిక్షణ ఉంటుందని, నెలవారీ రూ.5వేల భత్యం అందుతుందని తెలిపారు. 21 – 24 ఏళ్ల వయస్సు కలిగి, కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగులు లేకుండా, గత ఏడాది వార్షిక ఆదాయం రూ.8లక్షల లోపు ఉన్న వారు అర్హులని వెల్లడించారు. ఎస్సెస్సీ, ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిప్లొమా, డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు pmintership.mca.gov.in ద్వారా గరిష్టంగా ఐదు ఇంటర్న్‌షిప్ ట్రేడ్లను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 1800116090 టోల్‌ఫ్రీ నంబర్‌లో సంప్రదించాలని ఆయన ఓ ప్రకటనలో సూచించారు.

వకుళామాత స్టేడియంలో యాగం


యాగం జరిపిస్తున్న అర్చకులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో నిర్మించిన శ్రీవకుళామాత స్టేడియంను ఈనెల 7వ తేదీన ప్రారంభించనున్నారు. గ్రామానికి చెందిన తుళ్లూరు కోటేశ్వరరావు–నిర్మల దంపతుల ఆర్థిక చేయూతతో నిర్మించిన ఈ స్టేడియం ప్రారంభోత్సవంలో భాగంగా మంగళవారం దాత దంపతులతో అర్చకులు యాగం జరిపించారు. గణపతి పూజ, పుణ్యావాచనం, రక్షాబంధనం, భూశుద్ధి, అఖండ దీపారాధన, మండపస్థాపన కార్యక్రమాలు జరగగా పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కట్లేరు ప్రాజెక్టులోకి సాగర్ జలాలు


కట్లేరు వద్ద పరిశీలిస్తున్న చైర్మన్, తదితరులు

ఎర్రుపాలెం: మండలంలోని కట్లేరు ప్రాజెక్టు ఆయకట్టులో పంటలకు ఇబ్బంది ఎదురుకాకుండా మంగళవారం సాగర్ జలాలను విడుదల చేశారు. పంటలకు నీరందక ఎదురవుతున్న ఇబ్బందులను రైతులు ఇటీవల డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఆదేశాల మేరకు పెనుబల్లి మండలం కొండ్రుపాడు ఎస్కేప్(88 కి.మీ.) వద్ద ఎన్‌ఎస్‌పీ మెయిన్ కెనాల్ నుంచి సాగర్ జలాలను కట్లేరుకు విడుదల చేశారు. ఈసందర్భంగా మార్కెట్ చైర్మన్ బండారు నర్సింహారావు తదితరులు కట్లేరును పరిశీలించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,650	6,300
కందులు	6,700	4,900
మినుములు	6,900	6,900
మిర్చి	14,000	6,000
మిర్చి తాలు	6,500	5,200
పత్తి	6,900	5,500

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.20,487

దగా చేస్తే ఉపేక్షించేది లేదు

- గిట్టుబాటు ధరతో మిర్చి కొనుగోలు చేసేలా పర్యవేక్షణ
- ఖమ్మం మార్కెట్‌లో పరిశీలించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తనిఖీ

ఖమ్మంవ్యవసాయం: మిర్చి తీసుకొచ్చే రైతులను ధర విషయంలో ఎవరు దగా చేయాలని ప్రయత్నించినా చర్యలు తప్పవని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ హెచ్చరించారు. మిర్చి ధర పతనమవుతున్న నేపథ్యాన కలెక్టర్ ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నాణ్యతను పరిశీలించిన ఆయన ధరలపై ఆరా తీయగా పలువురు రైతులు తక్కువగా చెల్లిస్తున్నారని, జెండాపాటతో పొంతన ఉండడం లేదని వాపోయారు. దీంతో పంట నాణ్యతగా ఉన్నా ధర ఎందుకు తక్కువగా చెల్లిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిర్చి ధరలో న్యాయం జరిగేలా చూస్తామని రైతులకు భరోసా కల్పించిన కలెక్టర్.. కొనుగోళ్లలో వేగం, నగదు చెల్లింపులు, మద్దతు ధరపై పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. వ్యాపారులు ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఏ.అలీం, ఖమ్మం మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మిర్చి రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఏఐ ద్వారా సులభంగా బోధన

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) వినియోగంతో విద్యార్థులకు సులభతరంగా బోధన చేయొచ్చని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఖమ్మం ఎన్నెస్పీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏఐ ఆధారిత బోధనను పరిశీలించిన ఆయన విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించాక మాట్లాడారు. జిల్లాలోని ఏడు పాఠశాలల్లో పైలట్ ప్రాజెక్టుగా ఈ విధానం అమలుచేస్తున్నామని, విద్యార్థులు తెలుగు, ఆంగ్లం అనర్గళంగా మాట్లాడడం, గణితంపై పట్టు సాధించేలా చూడడమే లక్ష్యమన్నారు. విద్యాశాఖ అకడమిక్ మానిటరింగ్ అధికారి కె.రవికుమార్, ఖమ్మం అర్బన్ ఎంఈఓ శైలజాలక్ష్మి, జీసీడీఓ తులసి, హెచ్‌ఎం బుర్రి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


ఏఐ ఆధారిత బోధనను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెంచాలి

ఖమ్మంవైద్యవిభాగం: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తూ మరింత నమ్మకం పెంచాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని తనిఖీ చేసిన కలెక్టర్ వివిధ విభాగాల్లో పరిశీలించి చికిత్స కోసం వచ్చిన వారితో సేవలపై ఆరా తీశారు. అనంతరం నూతన భవనాల నిర్మాణ పనులు, దివ్యాంగులచే నిర్వహిస్తున్న పెయిడ్‌పార్కింగ్, మహిళా శక్తి క్యాంటీన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే వారితో వైద్యులు, సిబ్బంది మర్యాదగా ప్రవర్తించడమే కాక మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. జిల్లా ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ బి.కిరణ్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

గర్భిణులకు ఆరోగ్యంపై అవగాహన

ఖమ్మంవైద్యవిభాగం: గ్రామస్థాయిలో గర్భిణులు ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఏఎన్‌ఎంలపై ఉందని డీఎంహెచ్‌ఓ కళావతిబాయి తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం 'ఆర్మన్' సంస్థ సహకారంతో 'అమ్మ కోసం' పేరిట ఏఎన్‌ఎంలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ గర్భధారణ మొదలు ప్రసవం వరకు మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తే మాతృమరణాలను తగ్గించవచ్చని పేర్కొన్నారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సైదులు, ఆర్మన్ ఆర్గనైజేషన్‌కు చెందిన డాక్టర్ అఖిల పలు అంశాలను వివరించగా టీఓటీలు డాక్టర్ స్రవంతి, డాక్టర్ చందన, డీపీహెచ్‌ఎన్‌ఓ ఎస్.శేషుపద్మ, డీసీఎం ఎస్.రఘురాం, డీపీఎం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

25న పోస్టల్ పెన్షన్ అదాలత్

ఖమ్మంగాంధీచౌక్: హైదరాబాద్ రీజియన్ స్థాయిలో ఈనెల 25న పోస్టల్ పెన్షన్ అదాలత్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహిస్తున్నట్లు ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ వి.వీరభద్రస్వామి తెలిపారు. పెన్షన్ సంబంధిత అంశాలపై ఫిర్యాదులు ఉన్న వారు 'అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయం, హైదరాబాద్ రీజియన్, హైదరాబాద్–1, తెలంగాణ సర్కిల్ డాక్ సదన్, 5వ ఫ్లోర్, ఆబిడ్స్, హైదరాబాద్' చిరునామాకు చేరేలా ఈనెల 20వ తేదీ లోగా పంపించాలని తెలిపారు. కవర్‌పై 'పోస్టల్ పెన్షన్ అదాలత్ ఆఫ్ హైదరాబాద్ రీజియన్' అని రాయాలని తెలిపారు. ఆయా ఫిర్యాదులపై ఈనెల 25న ఉదయం 11:30 గంటలకు మొదలయ్యే పెన్షన్ అదాలత్‌తో meet.google.com/ytf& ptji& wwf లింక్ ద్వారా పాల్గొనవచ్చని వెల్లడించారు.

కొత్త బస్టాండ్ ఫుడ్‌కోర్టులో ఇడ్లీల్లో పురుగులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం కొత్త బస్టాండ్‌లోని ఫుడ్ కోర్టులో టిఫిన్ చేసేందుకు వచ్చిన వ్యక్తికి చేదు అనుభవం ఎదురైంది. మంగళవారం మధ్యాహ్నం దేవేందర్ ఫుడ్‌కోర్టుకు వెళ్లి సాంబార్ ఇడ్లీ ఆర్డర్ చేశాడు. ఆయన ఇడ్లీ తింటుండగా అందులో పురుగు రావడంతో ఇదేమిటని ప్రశ్నించినా నిర్వాహకుల నుంచి స్పందన లేక జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.కిరణ్‌కుమార్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా, కొత్త బస్టాండ్‌లోని హోటల్ నిర్వాహకులు పరిశుభ్రత పాటించడం లేదని బస్టాండ్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఈ విషయమై ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌ను వివరణ కోరగా ఓ వ్యక్తి ఫోన్‌లో ఫిర్యాదు చేశాడని, అందుబాటులో లేనందున త్వరలోనే తనిఖీ చేస్తామని చెప్పినట్లు వెల్లడించారు.


ఇడ్లీలో ఉన్న పురుగు (సర్కిల్‌లో)

ధర, దిగుబడి ఇచ్చే వంగడాలపై దృష్టి

రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి

ఖమ్మంవ్యవసాయం: అధిక దిగుబడితో పాటు మార్కెట్‌లో మంచి ధర లభించే వంగడాల రూపకల్పనపై దృష్టి సారించామని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి తెలిపారు. చైర్మన్, అధికారుల బృందం జిల్లాలోని పలుప్రాంతాల్లో సాగవుతున్న పెసర తదితర పంటలను పరిశీలించారు. ఆతర్వాత ఖమ్మంలోని సంస్థ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వచ్చే ఏడాది వానాకాలం సీజన్‌కు విత్తనాల లభ్యతపై ఆరాతీసిన చైర్మన్ మాట్లాడుతూ ప్రాంతాల వారీగా నేల రకాల ఆధారంగా విత్తనాలు సరఫరా చేస్తామని తెలిపారు. అధిక దిగుబడి, ధర దక్కేలా వంగడాలను రైతులకు సమకూరుస్తామని చెప్పారు. తొలుత రఘునాథపాలెం మండలం గణేశ్వరం శివారులో ఉన్న పెసర చేలను చైర్మన్ అన్వేష్‌రెడ్డి, అధికారులు పరిశీలించారు. ఈ బృందంలో విత్తనాభివృద్ధి సంస్థ ప్రొడక్షన్, మార్కెటింగ్ మేనేజర్లు సంధ్యారాణి, రాజీవ్‌కుమార్, ఉమ్మడి జిల్లా రీజినల్ మేనేజర్ బిక్షం, విత్తన అధికారి తేజశ్రీ తదితరులు ఉన్నారు.


రైతులతో మాట్లాడుతున్న చైర్మన్, అధికారులు

సేవాలాల్ గద్దెల తొలగింపుపై ఆందోళన


బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న బంజారాలు

కారేపల్లి: బంజారాల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ గద్దెలను తొలగించడంపై గిరిజనులు కారేపల్లిలో మంగళవారం ఆందోళన చేపట్టారు. ఇటీవల కారేపల్లి సర్వే నంబర్ 38లోని ప్రభుత్వ స్థలంలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని నిర్వహించగా, గద్దెలు నిర్మించారు. అయితే, ఇక్కడ 17 గుంటల భూమిని గతంలోనే కారేపల్లి బీసీ హాస్టల్ భవన నిర్మాణానికి కేటాయించి బోర్డు సైతం ఏర్పాటు చేశారు. ఇంతలోనే గద్దెలు నిర్మించినట్లు తెలుసుకున్న బీసీ సంక్షేమ శాఖ అధికారులు నిర్మాణ బాధ్యులపై పోలీసులకు ఫిర్యాదు చేయడమే కాక, సోమవారం గద్దెలు, దేవతల రాళ్లను తీయించారు. ఈ విషయం తెలియడంతో బుధవారం వివిధ గ్రామాల బంజారాలు, వివిధ సంఘాల నాయకులు కారేపల్లిలో ఆందోళన చేపట్టారు. బస్టాండ్ సెంటర్‌లో గంట పాటు రాస్తారోకో చేయగా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. దీంతో సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, కారేపల్లి, కామేపల్లి ఎస్‌ఐలు ఎన్.రాజారాం, సాయికుమార్ చేరుకుని వారికి నచ్చచెప్పే ప్రయత్నం చేసినా ససేమిరా అన్నారు. చివరకు దేవతల రాళ్లు, జెండాలు ఏర్పాటుచేయడంతో ఆందోళన విరమించారు.

వెంకట్‌రెడ్డి ఆశయాలను సాధిస్తాం


వెంకట్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, నాయకులు

కామేపల్లి: మాజీ మంత్రి, దివంగత రాంరెడ్డి వెంకట్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తామని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. కామేపల్లిలోని కొత్తలింగాల క్రాస్‌లోని వెంకట్‌రెడ్డి విగ్రహం వద్ద ఆయన 9వ వర్ధంతి సందర్భంగా మంగళవారం వారు నివాళులర్పించి మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని బడుగు, బలహీన వర్గాలకు వెంకటరెడ్డి అండగా నిలిచి, వారి అభివృద్ధికి బాటలు వేశారని తెలిపారు. ఇదే సమయాన కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ కార్యకర్తలను కాపాడుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ డైరెక్టర్ రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు రాంరెడ్డి కృష్ణారెడ్డి, శ్రీచరణ్‌రెడ్డి, జగన్నాథరెడ్డి, మానుకొండ రాధాకిషోర్, గింజల నరసింహారెడ్డి, దమ్మలపాటి సత్యనారాయణ, మద్దినేని రమేశ్‌బాబు, నర్సింహారావు, ధనియాకుల హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు వ్యాన్ దగ్ధం


కోనాయపాలెం సమీపాన కాలిపోతున్న వ్యాన్

ఏన్కూరు: ఏసీలు, రిఫ్రిజిరేటర్లను తీసుకెళ్తున్న వాహనంలో ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి పూర్తిగా కాలిపోయింది. ఖమ్మంకు చెందిన రమేష్ తన మినీ వ్యాన్‌లో 9ఏసీలు, 12 రిఫ్రిజిరేటర్లను మంగళవారం కొత్తగూడెం తీసుకెళ్తున్నాడు. ఏన్కూరు మండలం కోనాయపాలెం సమీపాన ఒక్కసారిగా వ్యాన్‌కు మంటలు చెలరేగడంతో వ్యాన్ పూర్తిగా దగ్ధమైంది. ఈమేరకు సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపుచేశారు. కాగా, ఏసీలు, ఫ్రిజ్‌లకు సంబంధించి గ్యాస్ సిలిండర్లు పేలడంతో రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు ఆందోళనకు గురయ్యారు.

బౌద్ధక్షేత్రం సందర్శన


క్షేత్రం వద్ద బౌద్ధబిక్షువులు, ఉపాసకులు

నేలకొండపల్లి: దక్షిణ భారతదేశంలో కెల్లా పెద్దదైన నేలకొండపల్లిలోని బౌద్ధక్షేత్రాన్ని బౌద్ధ భిక్షువులైన సద్ధా రక్కితా, బిక్షు ప్రజ్ఞానంద మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మహాబోధి, మహావిహార నిర్వహణను పూర్తిగా బౌద్ధ బిక్షువులతో కూడిన కమిటీకి అప్పగించాలని కోరారు. కాగా, క్షేత్రంలో బ్రాహ్మణ పూజారులతో జరిగే పూజాక్రతువులు నిషేధించాలనే అభ్యర్థనలు వస్తున్నాయని తెలిపారు. ఈమేరకు ప్రాచీన కట్టడాలను పరిరక్షించి ఆధ్మాతిక కేంద్రాలుగా అభివృద్ధి చేయడమే కాక స్థానిక ఉపాకులను నిర్వహణలో భాగస్వామ్యులుగా చేయాలని కోరారు. బౌద్ధ ఉపాసకులు వంగూరి ఆనందరావు, వెంకట్, ఈదయ్య, వెంకన్న, కె.వెంకటేశ్వర్లు, తోళ్ల సురేష్ పాల్గొన్నారు.

'ప్రభుత్వ చొరవ లేకే మిర్చి ధర పతనం'

ఖమ్మంమయూరిసెంటర్: మిర్చి ఎగుమతులకు ప్రభుత్వం చొరవ చూపకపోవడం, గతేడాది పండించిన పంట నిల్వ ఉండడంతో ధర గణనీయంగా పడిపోయిందని వ్యవసాయ శాస్త్రవేత్త బలేజిపల్లి శరత్ బాబు అన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా మహాసభల సందర్భంగా మంగళవారం 'మిర్చి ధర పతనం– పరిష్కార మార్గాలు' అంశంపై జిల్లా పరిషత్ హాల్‌లో సదస్సు ఏర్పాటుచేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ అధ్యక్షతన జరిగిన సదస్సులో శరత్‌బాబు మాట్లాడుతూ దేశంలో పండించిన వివిధ రకాల మిర్చిని ఇతర దేశాలు దిగుమతి చేసుకునేవని.. ఈ ఏడాది అక్కడి పరిస్థితులు, అమెరికాలో ట్రంప్ తీసుకుంటున్న చర్యలు ధరల పతనానికి కారణమయ్యాయని తెలిపారు. ప్రధాని మోదీ ట్రంప్‌తో సమావేశమైనప్పుడు ఎగుమతుల విషయంపై చొరవ తీసుకుంటే ఫలితం ఉండేదని చెప్పారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం మిర్చి బోర్డు ఏర్పాటు చేసి నాఫెడ్ ద్వారా క్వింటాకు రూ.25వేల చొప్పున కొనుగోలు చేయాలని, తద్వారా రైతులకు న్యాయం జరుగుతుందంటూ తీర్మానం చేశారు. సదస్సులో రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు బాగం హేమంతరావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు, మాజీ ఎమ్మెల్యే చంద్రావతితో పాటు వివిధ సంఘాల నాయకులు కొండపర్తి గోవిందరావు, నల్లమల వెంకటేశ్వరరావు, పోతినేని సుదర్శన్ రావు, గుర్రం అచ్చయ్య, దండి సురేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శాస్త్రవేత్త శరత్‌బాబు

వివిధ కేసుల్లో పాత నేరస్తుల అరెస్ట్


ఖమ్మంక్రైం: జిల్లా కేంద్రంలో కొంతకాలంగా నేరాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న రౌడీ షీటర్ ముద్దగుల నవీన్‌తో పాటు పాత నేరస్తుడు మంజుల విజయ్‌కుమార్‌ను అరెస్ట్ చేసినట్లు ఖమ్మం టూటౌన్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ తెలిపారు. ఖమ్మంలోని ఎన్నెస్పీ కాలనీలో ఎస్సై రామారావు ఆధ్వర్యాన పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పోలీసులను చూసి వీరిద్దరు పారిపోయే ప్రయత్నం చేశారని పేర్కొన్నారు. దీంతో అదుపులోకి తీసుకుని విచారించగా ద్వారకనగర్ వాసులైన పాత నేరస్తులు నవీన్, విజయ్‌కుమార్‌గా తేలిందని తెలిపారు.

పలు నేరాల్లో నిందితులు

గత నెల 9న ఎన్నెస్పీ కాలనీలో స్కూటీపై వెళ్తున్న వ్యక్తిని బెదిరించిన వీరిద్దరు రూ.30వేలు లాక్కుని పారిపోయారు. అలాగే, కవిరాజ్‌నగర్‌లో గత నెల 14న అర్ధరాత్రి బైక్‌పై వెళ్తున్న వ్యక్తి కళ్లల్లో కారం చల్లి బ్యాగ్ లాక్కోవడానికి యత్నించగా సదరు వ్యక్తి ప్రతిఘటించడంతో పారిపోయారు. కాగా, నవీన్ ఖమ్మంలో కొన్నేళ్లుగా గొడవలు, సెటిల్‌మెంట్లు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని, రెండు హత్యాయత్నం కేసులతో పాటు ఇతర కేసుల్లో జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చాడని సీఐ తెలిపారు. నవీన్‌పై ఖమ్మం టూ టౌన్ పోలీస్ స్టేషన్లో రౌడీషీట్ కూడా ఉందని పేర్కొన్నారు. మరో నిందితుడు విజయ్‌కుమార్‌పై 2021లో ఖమ్మం అర్బన్ పోలీస్ స్టేషన్‌లో గంజాయి కేసు నమోదు కాగా, వీరి నుంచి స్కూటీ స్వాధీనర చేసుకుని మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

ప్రభుత్వ బాలికల కళాశాలకు రూ.లక్ష విరాళం

సత్తుపల్లిటౌన్: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆశా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు డాక్టర్ మట్టా దయానంద్ సూచించారు. సత్తుపల్లి ప్రభుత్వ బాలికల కళాశాలకు ఏటా రూ.లక్ష చొప్పున ఇచ్చే ఆర్థిక సాయంలో భాగంగా మంగళవారం ఆయన రూ.లక్ష అందజేశారు. ఇప్పటివరకు రూ.3 లక్షలు అందజేసిన నేపథ్యాన అభివృద్ధితో పాటు విద్యార్థుల ప్రోత్సాహకానికి వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం యువసేవా సమితి ఆధ్వర్యాన విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్లతో పాటు ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.


విద్యార్థినులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న దయానంద్

ముగ్గురు విద్యార్థినులకు ఫుడ్‌ఫాయిజన్

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థినులు మంగళవారం ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురయ్యారు. ముగ్గురు విద్యార్థినులకు వాంతులు, విరోచనాలు కావటంతో కళాశాల బాధ్యులు నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. కాగా, ఆదివారం బయటకు వెళ్లిన విద్యార్థినులు హోటల్‌లో తిన్న కారణంగా వాంతులు, విరోచనాలు అయినట్లు కళాశాల బాధ్యులు వెల్లడించారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ఖమ్మంఅర్బన్: ఖమ్మం ఇందిరానగర్ జంక్షన్‌లోని వీఆర్‌కే సిల్క్ వెనక వీధిలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మహిళ మెడలో నుంచి దుండగులు బంగారు గొలుసు లాక్కెళ్లారు. పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగి సున్నా లత తన ద్విచక్ర వాహనంపై సోమవారం రాత్రి ఇంటికి వెళ్తుండగా రాధాకృష్ణనగర్ రోడ్డు –1లో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలో గొలుసు లాగారు. ఈక్రమాన గొలుసు తెగిపోగా సుమారు 3గ్రాముల మేర దుండగుల చేతికి చిక్కింది. ఘటనపై బాధితురాలి ఫిర్యాదుతో ఖమ్మం అర్బన్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో 'ఎఫ్‌ఆర్‌ఎస్' హాజరు

కల్లూరురూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల హాజును ఫేస్ రికగ్నైజేషన్ సిస్టం(ఎఫ్‌ఆర్‌ఎస్) ద్వారా నమోదు చేయాలని జిల్లా సంక్షేమాధికారి కీసర రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. ఐసీడీఎస్ సీడీపీఓ నిర్మలజ్యోతి ఆధ్వర్యాన కల్లూరు సూపర్‌వైజర్లకు మంగళవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రాలకు వచ్చే ఏడు నెలల నుంచి మూడేళ్ల చిన్నారుల హాజరు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈవిషయమై అంగన్‌వాడీ టీచర్లందరికీ అవగాహన కల్పించాలని చెప్పారు. కాగా, సూపర్‌వైజర్ వెంకటమ్మకు గ్రేడ్–1 సూపర్‌వైజర్‌గా పదోన్నతి పత్రాలను డీడబ్ల్యూఓ అందజేశారు. ఏసీడీపీఓలు రత్తమ్మ, మెహరున్నీసాబేగం, నవ్య, ఉద్యోగులు శివరామకృష్ణ, సంధ్యారాణి, సుజాత, భవాని, వెంకటమ్మ, మల్లేశ్వరి, రాజ్యలక్ష్మి, సత్యవతి, రోజా, రత్నకుమారి, అనురాధ, హరీష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీడబ్ల్యూఓ రాంగోపాల్‌రెడ్డి

ట్రాక్‌పైకి వచ్చిన ట్రాక్టర్ సీజ్

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురం రైల్వేగేట్ వద్ద నిబంధనలకు విరుద్ధంగా ట్రాక్‌పైకి రావడంతో ముదిగొండ మండలం గంధసిరి వాసికి సంబంధించి ఇసుక ట్రాక్టర్‌ను మంగళవారం సీజ్ చేసినట్లు జీఆర్పీ సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం చెన్నై నుంచి న్యూఢిల్లీకి వెళ్తున్న దురంతో ఎక్స్‌ప్రెస్ పందిళ్లపల్లి స్టేషన్ సమీపానికి వస్తుండగా రామకృష్ణాపురం గేట్‌పైకి ట్రాక్టర్ డ్రైవర్ చేరుకున్నాడు. ఈ విషయాన్ని గమనించిన లోకో పైలట్ వేగాన్ని నియంత్రించడంతో ప్రమాదం తప్పింది. ఈమేరకు లోకో పైలట్ ఫిర్యాదుతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి యజమాని, డ్రైవర్‌కు నోటీసులు ఇచ్చినట్లు సీఐ తెలిపారు.